# సమస్యల పరిష్కారానికి కృషి

- అంగన్‌వాడీలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ హామీ



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్‌నాగారం:** అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అసెంబ్లీలో మాట్లాడుతానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. నగరంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే ధన్‌పాల్ ఇంటి వద్ద బైఠాయించి, నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యేకు సమస్యలను వివరించారు. 'అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని గతంలో సమ్మె చేసినట్లు తెలిపారు. దీంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచుతామని, పెన్షన్ వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈమేరకు ఐసీడీఎస్ మంత్రి సీతక్కకు, ఉన్నతాధికారులకు పలుమార్లు దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతాను అని హామీ ఇచ్చారు. అవసరమైతే అసెంబ్లీ ముందు మీ సమస్యలపై ధర్నా చేస్తానని అన్నారు. సంఘ ప్రతినిధులు సూర్యకళ, రాజ్యలక్ష్మి, సరిత, జరీన, లలిత, సునీత, సునంద, లక్ష్మీభాగ్య పాల్గొన్నారు.

# ఇంటి నంబర్లు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న ప్రజలు

**నిజామాబాద్‌నాగారం:** తమ ఇళ్లకు నంబర్లను కేటాయించాలని 44వ డివిజన్ గూడెం ప్రజలు కోరారు. ఈమేరకు వారు సోమవారం మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చి, నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా నగరంలోని ద్వారకానగర్‌లో తాము గుడిసెల్లో నివసిస్తున్నామని, కరెంట్‌బిల్లులు ప్రతి నెల చెల్లిస్తున్నామన్నారు. అయినా తమకు ఇంటినంబర్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ మకరందుకు విన్నవించారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు మా ఓట్ల కోసం న్యాయం చేస్తామని చెప్పి ఓట్లు పూర్తికాగానే ఇటు వైపు రావడం లేదన్నారు. ఇప్పటికైనా మాకు ఇళ్ల నంబర్లు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. మల్లమ్మ, బాలమ్మ, లచ్చవ్వ, భారతమ్మ, బాలయ్య తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ లైసెన్స్ ఇంజినీర్ చేతివాటం!

- నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ పత్రాలు సృష్టించి వసూళ్లు
- కమిషనర్‌కు ఫిర్యాదు

**నిజామాబాద్ నాగారం:** నగరంలోని ఓ మున్సిపల్ లైసెన్స్ ఇంజినీర్ కాసులకు కక్కుర్తి పడి మున్సిపల్‌కు వచ్చే ఆదాయానికి గండికొడుతున్నారు. ఓ స్థలం విషయమై సదరు అధికారి నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ పత్రాలు సృష్టించి, చెల్లింపులు చేయడంతో బాధితురాలికి అధికారులు నోటీసులు అందజేశారు. దీంతో బాధితురాలు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని గుమాస్తా సంఘం వెంచర్లలో అజ్జన్ విజయ పేరు మీద 235గజాల స్థలంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎల్‌ఆర్‌ఎస్ కింద ఆయన గతంలో దరఖాస్తు చేసుకోలేదు. కాబట్టి మున్సిపాలిటీ టీపీ స్‌బిపాస్ ద్వారా సుమారు రూ. 3,00,000 ఫీజు కట్టాలి. దీంతో లైసెన్స్ ఇంజినీర్ రంగంలోకి దిగారు. ఫీజును తగ్గిస్తానని దరఖాస్తుదారుడితో మాట్లాడుకుని రూ. 2,50,000 తీసుకున్నాడు. ఇందులో నుంచి రూ.60 వేలు తాను జేబులో వేసుకుని, నకిలీ పత్రాలు సృష్టించి, బల్దియాకు రూ.1,96,000 కట్టాడు. మొత్తంగా బల్దియాకు రూ.3,77,000 ఫీజుకు గాను కేవలం రూ.1,90,000 మాత్రమే కట్టారు. ఈక్రమంలో దరఖాస్తురాలు విజయకు అధికారులు గత ఏడాది ఏప్రిల్ 22న నోటీసు నోటీసులు అందజేశారు. ఆమె సోమవారం తనను మున్సిపల్ లైసెన్సు ఇంజినీర్ రవికృష్ణ నమ్మించి మోసం చేశారని అందువల్లే మున్సిపల్ కార్యాలయం నుంచి నోటీసు వచ్చిందని కమిషనర్‌కు బాధితురాలు విన్నవించింది. ఇంజినీర్‌ను కలిస్తే అదనంగా ప్రస్తుత ఫీజుతో పాటు అదనంగా రూ. 3లక్షలు ఇవ్వాలని చెప్పాడన్నారు. ఈవిషయమై తమకు న్యాయం చేయాలని కోరారు.

## సంక్షిప్తం

### గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ



**డిచ్‌పల్లి:** మండలంలోని ధర్మారం(బి)గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ సంగీత దోమకొండ గురుకుల కళాశాలకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సోమవారం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సంగీతను సత్కరించి, మొక్కను బహూకరించారు. అలాగే అధ్యాపకురాలు విక్టోరియాను సత్కరించి, మొక్కను బహుకరించారు. జిల్లా అధ్యక్షుడు నక్క రాజేందర్, ఉపాధ్యక్షుడు లింగంపల్లి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గంగ నర్సయ్య, దీపక్, బాలరాజ్ పాల్గొన్నారు.

### జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక





**సిరికొండ:** మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు జశ్విత, లోకేష్, విశాల్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు జెడ్పీహెచ్‌ఎస్ పీడీ నాగేష్ సోమవారం తెలిపారు. కేరళలోని కోల్లాంలో ఈ నెల 19 నుంచి జరిగే సబ్ జూనియర్ సౌత్ జోన్ నేషనల్ హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను పీజీహెచ్‌ఎం రాములు, ఎస్‌ఎంసీ చైర్మన్ లావణ్య, ఉపాధ్యాయులు, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి రమణ, వీడీసీ సభ్యులు అభినందించారు.

### పుస్తకం హస్తభూషణం

**నిజామాబాద్‌నాగారం:** చేతికి పుస్తకాలు ఆభరణం వంటివని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. వినాయక్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పుస్తక ప్రియుడన్నారు. ప్రభుత్వాలు పుస్తక పఠనం వైపు అందరిని ఉసిగొల్పాలన్నారు. సభ్యులు బాబురావు, రమేష్, ప్రవీన్‌లాల్ ఉన్నారు.

### జీజీహెచ్‌లో ఫుడ్ కాంట్రాక్టు ఇవ్వాలని వినతి

**నిజామాబాద్‌నాగారం:** నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఫుడ్ కాంట్రాక్టును అంబేడ్కర్ ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీకి ఇవ్వాలని అధ్యక్షుడు నాయుడు రాజు కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు విన్నవించారు.

### ఆర్మూర్ ఆర్డీవోకు సన్మానం



**జక్రాన్‌పల్లి:** ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌ను సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు రాష్ట్ర కార్యదర్శి దత్తాద్రిగౌడ్, జిల్లా కారదర్శి ప్రసాద్ సత్కరించారు. ఆర్డీవో పరిధిలో రెవెన్యూ, ధరణి సమస్యలపై చర్చించినట్లు వారు తెలిపారు.

### హోంగార్డుకు..



**ఖలీల్‌వాడి:** నిజామాబాద్ హోంగార్డ్ గంగారెడ్డి సోమవారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో పదవీవిరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీరిని సీపీ జ్ఞాపికలతో సత్కరించారు. అదనపు డీసీపీ (ఏఆర్) శంకర్ నాయక్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ (హోమ్ గార్డు విభాగం) సతీష్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్ పాల్గొన్నారు.

### నియామకం

**ఖలీల్‌వాడి:** యూఎస్‌ఎఫ్‌ఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్లీనరీ సమావేశంలో ఆయనను నియమించినట్లు తెలిపారు.

### రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



**మోపాల్:** మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల రూ.10కోట్లతో పనులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి భూమిపూజ చేశారు. పనుల ప్రారంభంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### బాధితుడి కుటుంబానికి చేయూత

**పెర్కిట్(ఆర్మూర్):** పెర్కిట్‌లోని ఓ బాధిత కుటుంబానికి సేవ్ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రభాస్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వైస్ చైర్మన్ బైరి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

## సమాచారం..

### నేడు 'వానాకాలం పంటల'పై అవగాహన

**డిచ్‌పల్లి:** మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతువేదికలో మంగళవారం 'వానాకాలం పంటలో ఎరువుల యాజమాన్యం' అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నాణ్యమైన భోజనం అందించాలి



**మోపాల్(నిజామాబాద్‌రూరల్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనానికి వండుతున్న బియ్యంను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అదేవిధంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వివరాలను హెచ్‌ఎం వనితను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలోని కొన్ని పాఠశాలలకు ముక్కిపోయిన, పురుగులు ఉన్న బియ్యం సరఫరా అయ్యాయని, వాటిని వెనక్కి పంపించి, కొత్త బియ్యం అందించామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను నాణ్యతతో వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇందూరువాసి రెస్టారెంట్‌లో రోహిత్‌శర్మ సందడి



**నిజామాబాద్‌నాగారం:** అమెరికాలోని టెక్సాస్ స్టేట్ ఫిక్సోలో ఇందూరుకు చెందిన శరత్ స్థాపించిన 'దేశీ చౌరస్తా' రెస్టారెంట్‌లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సందడి చేశారు. అక్కడి ఫేమస్ ఇరానీ చాయ్ గురించి అడిగి మరీ రుచి చూశారు. అనంతరం రెస్టారెంట్ సభ్యులతో కలిసి సెల్ఫీలు దిగారు. ఈ దృశ్యాలను రెస్టారెంట్ వ్యవస్థాపకుడు శరత్ పొద్దుటూరి సోషల్‌మీడియాలో షేర్ చేశారు. శరత్ 2022లో కొప్పెల్ సిటీలో మొదటి రెస్టారెంట్ ప్రారంభించగా, ప్రస్తుతం వ్యాపారాన్ని 14 బ్రాంచీలకు విస్తరించారు. తన రెస్టారెంట్లలో వివిధ దేశాలకు చెందిన 300 మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



**నిజామాబాద్‌నాగారం:** నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు అనీఫ్, ఉపాధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ.. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

## ఘనంగా జాతీయ నైపుణ్య దినోత్సవం

**జక్రాన్‌పల్లి:** మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం జాతీయ నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ మనుగడకు నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలిపారు. ఎస్సెస్సీ విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**డిచ్‌పల్లి:** ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలు నాటి సంరక్షించాలని డిచ్‌పల్లి మండల పరిషత్ అధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గాంధీనగర్ కాలనీలో ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి మూడు మొక్కల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఎంపీవో తెలిపారు. కార్యదర్శి నిట్టు కిషన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ రజత్‌కుమార్, బిల్‌కలెక్టర్లు సంతోష్, రాము, సిబ్బంది శ్యాంసన్, బాబా, నర్సయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



**సిరికొండ:** సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి చిట్యాల అరవింద్ సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, సత్యశోధక్ పాఠశాల, న్యావనంది, కొండూర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అరివింద్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు, చికిత్స గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్ వివరించారు. ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యతను తెలియచేశారు. సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**నగరంలో..**



**నిజామాబాద్‌అర్బన్:** నగరంలోని కోటగల్లి జీపీఎస్ పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు శుభ్రత పాటించాలన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రామచంద్ర గైక్వాడ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### పోలీసు కళాజాత



**ధర్పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాలు, డ్రంకెన్‌డ్రైవ్, అండర్ ఏజ్ డ్రైవింగ్ నేరాలపై కళాకారులు పాటలు, నాటికల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, చెడు వ్యసనాల బారిన పడవద్దని, బాలిక రక్షణ, తల్లిదండ్రుల సంరక్షణ లాంటి విషయాలపై అవగాహన కల్పించారు.ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

### ముదిరిన వరి నారు కొనలు తుంచి నాటుకోవాలి



**జక్రాన్‌పల్లి:** ముదిరిన వరి నారు కొనలను తుంచి నాటుకోవాలని ఏవో దేవిక రైతులకు సూచించారు. మండలంలోని మాదాపూర్‌లో సోమవారం వరి నారు కొనలు తుంచడంపై ఆమె క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ.. ముదిరిన నారు నాటినట్లయితే తక్కువ దూరంలో ఎక్కువ నారు నాటాలన్నారు. నారు నాటడానికి ముందు తుకంలో 3జీ గుళికలు చల్లుకున్నట్లయితే మొగి పురుగు రాకుండ నివారించవచ్చని తెలిపారు. ఎరువులను వ్యవసాయ అధికారుల సి ఫారసు మేరకు సరైన సమయంలో పిచికారి చే యాలన్నారు. ఏఈవో సంధ్య రైతులు పాల్గొన్నారు.

### హామీలను అమలు చేయాలి

**మోపాల్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని ప్రజాపంథా జిల్లా నాయకులు చంద్రవు సాయాగౌడ్ డిమాండ్‌చేశారు. ఈమేరకు సోమవారం మోపాల్‌లో హామీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. నాయకులు గంగమల్లు, మంగళ్‌పాడ్ నారాయణ, శేఖర్, రాములు, చిన్న గంగమ్మ, పర్వన్న, పోశెట్టి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

**నిజామాబాద్‌అర్బన్:** నగరంలోని కోటగల్లి బంగారు మైసమ్మ ఆలయంలో గత తొమ్మిది రోజులుగా వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. చివరిరోజు సోమవారం వారాహి అమ్మవారికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ.. ఉత్సావాలు నిర్వహిస్తున్న చింతకాయల రాజేందర్, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాడలని మొక్కలు చెల్లించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతరెడ్డి దేవేందర్, ఆలయ కమిటీ కన్వీనర్ ధర్మపురి, కార్తీక్, హరీష్ రెడ్డి, సుగంధం హరీష్, భాస్కర్, సతీష్, ఆనంద్, రాకేష్ పాల్గొన్నారు.

# రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం




అన్వేష్‌రెడ్డిని సన్మానిస్తున్న జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు, మోపాల్ కాంగ్రెస్ నాయకులు

**డిచ్‌పల్లి/జక్రాన్‌పల్లి/మోపాల్:** వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన ఎస్ అన్వేష్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో ఆయనను నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, సాయరెడ్డి, వినోద్, నర్సారెడ్డి, గంగారెడ్డి, లక్ష్మణ్, జైడి మల్లేష్, రిక్కల సురేష్, జితేందర్‌నాయక్, కెతావత్ యాదగిరి, రవి తదితరులు ఉన్నారు.

## ఎఫ్‌ఏ, ఎస్‌ఏ బుక్కులు అందజేత



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న ప్రతినిధులు

**మోపాల్:** మోపాల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్నే బసవయ్య స్మారక చారిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.40వేల విలువైన రికార్డు (ఎఫ్‌ఏ, ఎస్‌ఏ) పుస్తకాలను సోమవారం అందజేశారు. దీంతోపాటు రూ.3వేలతో కేబుల్ వైర్ కరెంట్ కనెక్షన్‌ను ఏర్పాటు చేయించారు. ఫౌండేషన్ సభ్యులు అన్నే లక్ష్మణ్‌రావు, నిర్మల, వెంకటేశ్వర్‌రావు, పద్మజ, అన్నే శ్యాంసుందర్ రావు, సుజాత, అన్నే ఉదయభాస్కర్, అన్నే అనితకు ఇన్‌చార్జి హెచ్‌ఎం గోవింద్ కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుమలత, క్యాతం రవి, ద్యాప రవి, శేఖర్, దండు నర్సయ్య, ముత్యం తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల తనిఖీ



**నిజామాబాద్‌నాగారం:** నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో శానిటేషన్ ఎన్‌ఓసీ సర్టిఫికెట్ ఉండాలని మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈక్రమంలో ఎమ్‌హెచ్‌వో సాజీత్‌అలీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ప్రయివేట్ పాఠశాలలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు తనిఖీలు చేపట్టారు. శానిటేషన్ ఎన్‌ఓసీ సర్టిఫికేట్ లేకుంటే ఫీజు వసూలు చేసి, సర్టిఫికేట్లు జారీ చేశారు.

## కూలి బకాయిలు చెల్లించాలి



**నందిపేట్(ఆర్మూర్):** ఉపాది హామీ కూలీలకు, వనసేవకులకు బకాయిలను వెంటనే చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఎంపీవో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు, వనసేవకులకు సకాలంలో కూలి డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

## జీపీ రికార్డుల పరిశీలన

**వర్ని:** మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో సోమవారం వర్ని ఎంపీడీవో వెంకటేష్ జీపీ రికార్డులను పరిశీలించారు. అలాగే నర్సరీ, మురికి కాలువలను, రోడ్లను తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

## మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్డ్ | 220 |
| | (కిలోకు) | లైవ్ | 180 |
| స్కిన్‌లెస్ | 260 | మటన్ | 800 |

## బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 73,600 | వెండి (కిలో) | 94,000 |
| 22 క్యారెట్స్ | 67,895 | | |

- నిజామాబాద్ బిజినెస్

## కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 48 | 70 | గాజరుగడ్డ | 35 | 60 |
| బెండకాయ | 25 | 50 | పచ్చిమిర్చి | 40 | 60 |
| బీరకాయ | 25 | 50 | దోసకాయ | 25 | 50 |
| దొండకాయ | 10 | 20 | ఆలుగడ్డ | 30 | 50 |
| బీర్నిసుకాయ | 70 | 95 | గోబిగడ్డ | 30 | 50 |
| కాకరకాయ | 40 | 60 | గోబిపువ్వు | 40 | 60 |
| వంకాయ | 10 | 20 | బీట్‌రూట్ | 25 | 50 |
| పాలకూర | 20 | 40 | కరివేపాకు | 40 | 60 |
| మెంతికూర | 40 | 75 | చామగడ్డ | 35 | 50 |
| కొత్తిమీర | 25 | 50 | గోరుచిక్కుడు | 40 | 60 |
| పుదీనా | 50 | 70 | చిక్కుడుకాయ | 40 | 60 |
| క్యాప్సికం | 50 | 75 | | | |

- సుభాష్‌నగర్

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | భారతీయుడు-2 (తెలుగు)-9.00, 12.30, 4.00, 7.25, 10.50 |
| స్క్రీన్-2 | భారతీయుడు-2(తెలుగు) -10.00<br>కల్కి-2898 ఏడీ(తెలుగు) -1.30, 3.20, 7.00<br>కల్కి-2898 ఏడీ(తెలుగు) -6.45 |
| స్క్రీన్-3 | కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.30, 1.30, 3.20, 07.00, 10.40 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | కల్కి-2898 ఏడీ (3డీ తెలుగు)- 11.00, 6.30<br>కల్కి-2898 ఏడీ(హిందీ)-2.45,10.15 |
| స్క్రీన్-2 | భారతీయుడు-2 (తెలుగు) - 11.15, 3.00, 6.45, 10.30 |
| స్క్రీన్-3 | కిల్(హిందీ) -12.15, 2.45, 9.00<br>భారతీయుడు - 2 (తెలుగు)- 5.15 |
| స్క్రీన్ -4 | సరఫరా (హిందీ) - 12.20, 3.40, 7.00, 10.20 |
| దేవి | భారతీయుడు-2 (తెలుగు) |
| నటరాజ్ | భారతీయుడు-2 (తెలుగు) |
| విజయ్ | కల్కి-2898 ఏడీ(తెలుగు) |